సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 66.653 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 66.653 టీఎంసీలు ఉన్నాయి. 1728 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3950 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.85,280
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,745
3 శాతం జీఎస్టీతో	రూ.7,977
నవర (8 గ్రా)	రూ.63,816

గరిష్టం/కనిష్టం
32.6 /23.6

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

భూములిస్తే.. మేం బతికేదెలా?



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

కావలి: సముద్రంలో చేపలు వేటాడం వృత్తిగా బతికే తమకు, వేట సాగక పొలాల్లో సేద్యం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ఉన్న అరకొర భూములు ఇస్తే మేం బతికేదెలా అంటూ కావలి మండలం పెద్దపట్టపుపాళెం పంచాయతీలోని గ్రామాల మత్స్యకారులు అధికారులను ప్రశ్నించారు. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, అందుకు అవసరమైన భూములు తీసుకుంటామని మారిటైం బోర్డు అధికారులు, కావలి ఆర్డీఓ వంశీకృష్ణతోపాటు రెవెన్యూ అధికారులు ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. చాటింపు, దండోరా వేయకుండానే, గ్రామస్తులకు కనీసం సమాచారం తెలియకుండా గ్రామసభ ఏర్పాటు చేయడంతో రైతులు నిలదీశారు. అధికారులు మాగాణికి ఎకరాకు రూ.15 లక్షలు, మెట్టకు రూ.12.5 లక్షలు చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించిందని చెప్పారు. దీంతో ఆయా గ్రామాల రైతులు అధికారుల తీరుపై మండిపడ్డారు. చెన్నాయపాళెం గ్రామానికి చెందిన రైతులు సేద్యంతోపాటు పాడితో బతికే తమ పొలాలను తీసుకుంటే తామెలా బతకాలంటూ సహనం కోల్పోయారు. అది కూడా అన్యాయమైన ధరలకు ఎందుకు ఇవ్వాలంటూ నిలదీశారు. ఇక్కడ మాగాణి ఎకరా రూ.55 లక్షలు ధర పలుకుతుందని, మెట్ట రూ.40 లక్షలు ధర ఉందన్నారు. అధికారులు చెప్పే ధరకు తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని, ఏం చేసుకుంటారో చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

మరీ అన్యాయంగా ఉంది



మా పంచాయతీని ఆనుకొనే రామాయపట్నం పోర్టును నిర్మిస్తున్నారు. పోర్టు నిర్మిస్తే మా బతుకులు మరింత మెరుగ్గా మారుతాయని ఆశ పడ్డాం. చేపలు పట్టడం, సేద్యం పనులు చేయడం తప్ప ఇతర పనులు రాని మేము, మా భూములు తీసుకుంటే ఎలా బతకాలి. మా పంచాయతీలోని గ్రామాలకు సమాచారం లేకుండా వేరే పంచాయతీలో గ్రామసభ పెట్టారు. మా పంచాయతీ గ్రామాల్లో భూములు తీసుకోవడానికి, పక్క పంచాయతీలో గ్రామసభ పెట్టడం ఏమిటి.. మరీ అన్యాయంగా ఉంది. ధర కూడా దారుణంగా ఉంది. మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు.

– గంగనగారి యాదగిరి, మత్స్యకారుడు, పెద్దపట్టపుపాళెం

అగ్రరాజ్యాలకు దీటుగా భారత్

- అన్ని రంగాల్లో వేగంగా భారత్ అభివృద్ధి
- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

వింజమూరు (ఉదయగిరి): 2016కు ముందు భారత్ అన్నీ అంశాల్లో దిగుమతులు చేసుకుంటూ విదేశాలపై ఆధారపడేది. ఇప్పుడు మనమే ప్రపంచ అగ్రరాజ్యాలతో పోటీ పడుతూ ఎగుమతి చేసే స్థాయికి చేరున్నామని మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, భారత రక్షణ శాఖ సాంకేతిక సలహాదారులు గుండ్రా సతీష్‌రెడ్డి తెలిపారు. వింజమూరులో ఆదివారం ఆపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల కార్యక్రమంలో మాట్లాడారు. మన ఆలోచన విధానమే మన భవిష్యత్‌ను నిర్దేస్తుందన్నారు. బిహార్, ఒడిశా, రాజస్థాన్ వెనుకబడిన ప్రాంతాలుగా చెబుతున్నప్పటికీ అక్కడ నుంచి ప్రతి ఏడాది ఎంతో మంది సివిల్ సర్వీసుకు ఎంపికవుతున్నాని గుర్తు చేశారు. మన దేశంలో యువత మేధా శక్తిని కొనుగోలు చేసేందుకు ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నట్లు చెప్పారు. 2015కు ముందు దేశంలో 458 అంకుర సంస్థలు ఉంటే నేడు 1.60 లక్షలు ఉన్నట్లు చెప్పారు. పేపర్ ప్రజంటేషన్, పీహెచ్‌డీలో మన విద్యార్థులు ప్రపంచ దేశాల్లో మూడో స్థానంలో ఉన్నారన్నారు. ఈ ఏడాది రక్షణ రంగంలో మనం ప్రపంచ దేశాలతో రూ.21 వేల కోట్ల వ్యాపారం చేశామన్నారు. ఇప్పటి నుంచే గోల్ పెట్టుకుని దాని కోసం శ్రమిస్తే విజయం తథ్యమన్నారు. ఉదయగిరి ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడిచి దేశ, సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించాలి అని సూచించారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకోసం తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం టాలెంట్ టెస్టులో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ అధ్యక్షుడు యల్లాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, డాక్టర్ మాసిలామణి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాలాజీ, స్థానిక నేతలు వెంగయ్య, రమాదేవి, మధు, కె.రాజగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

విప్ బ్రహ్మాస్త్రం

డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మక అడుగులు

- ఫ్యాన్ గుర్తుపై గెలిచిన వారికి విప్ వర్తింపు
- పార్టీకి రాజీనామా చేయకుండా కండువాలు మార్చారు
- ఫిరాయింపుదారులు వైఎస్సార్‌సీపీ సభ్యులుగానే గుర్తింపు
- విప్‌ను ధిక్కరిస్తే అనర్హత తప్పదు
- సుప్రీంకోర్టు, కేరళ కోర్టు జడ్జిమెంట్ల ఆధారంగా న్యాయపోరాటం

నిప్పు లాంటి విప్‌తో వైఎస్సార్‌సీపీ రాజకీయ ఆట మొదలు పెట్టింది. విప్ ధిక్కరిస్తే న్యాయస్థానంలో వారిపై అనర్హత వేటు పడేలా పక్కాగా ప్లానింగ్‌తో ముందుకెళ్తుండడంతో ఫిరాయింపుదారుల్లో ఆందోళన మొదలైంది. విప్‌ను ధిక్కరిస్తే అనర్హతకు గురికావడం ఖాయమని ఫిరాయింపుల చట్టంలోని పదో షెడ్యూల్లో సవరించిన చట్టం చెబుతోంది. ఈ ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న అధికార పార్టీకి, ఫిరాయించిన ప్రజాప్రతినిధులను చట్ట ప్రకారంగానే ప్రజాకోర్టులో దోషులుగా నిలబెట్టాలనే వ్యూహంతో వైఎస్సార్‌సీపీ అడుగులు వేస్తోంది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు నగరపాలక సంస్థ, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీల్లో డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ల ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపుదారులపై వైఎస్సార్‌సీపీ విప్ బ్రహ్మాస్త్రం సంధించనుంది. అధికార పార్టీ రాజకీయ అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలతో పార్టీ ఫిరాయించి.. కండువాలు కప్పుకున్నప్పటికీ.. అధికారికంగా వీరు వైఎస్సార్‌సీపీ సభ్యులుగానే గుర్తించబడుతున్నారు. ఈ క్రమంలో ఏ మాత్రం విప్ ధిక్కరిస్తే వారి పదవీ గండం తప్పదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీ మరో పార్టీలో విలీనం జరిగితే అనర్హత వర్తించదు. కానీ ఒక పార్టీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న సభ్యుల్లో మూడొంతుల్లో రెండొంతుల సభ్యులు పార్టీని ఫిరాయించినప్పుడు అనర్హత వేటు పడడం ఖాయమని ఫిరాయింపుల చట్టం స్పష్టం చేస్తోంది. టీడీపీ తరఫున డిప్యూటీ మేయర్ పదవికి బీఫారం కూడా జారీ చేసే అర్హత లేదు.

వైఎస్సార్‌సీపీకే మెజార్టీ సభ్యులు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 54 డివిజన్లకు 54 డివిజన్లలో వైఎస్సార్‌సీపీ సింబల్‌పై గెలిచిన కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో డిప్యూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్ అహ్మద్ ఇటీవల ఎమ్మెల్యేగా పోటీ చేయాల్సిన పరిస్థితుల్లో డిప్యూటీ మేయర్‌తోపాటు కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. మేయర్ సైతం వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించినా.. అధికారికంగా ఆమోదం జరగలేదు. పార్టీ సభ్యత్వం రద్దు అయితే.. మేయర్ పదవిని కూడా కోల్పోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగలేదు కాబట్టి.. ప్రస్తుతం నెల్లూరు కార్పొరేషన్‌లో 53 మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లుగా అధికారికంగా గుర్తించబడుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో 20 వార్డులు ఉండగా, అందులో 18 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ సింబల్‌పై గెలిచిన వారే కౌన్సిలర్లుగా ఉన్నారు.

రాజకీయ అస్త్రసన్యాసం తప్పదా?

డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ల ఎన్నికల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పార్టీ విప్ ధిక్కరిస్తే రాజకీయ అస్త్రసన్యాసం తప్పదని రాష్ట్రంలో ఎంపీటీసీల నుంచి ఎంపీల విషయంలో తేటతెల్లమైంది. జిల్లాలో 2014 నుంచి 2019 వరకు జిల్లా పరిషత్, నెల్లూరు నగర పాలక సంస్థ ఎన్నికల్లో అనాటి అధికార పార్టీ ప్రోత్సహించిన ఫిరాయింపుదారుల రాజకీయ భవిష్యత్ అంధకారమైన విషయం విదితమే. ఆ నాడు పార్టీ ఫిరాయించిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు ప్రజాక్షేత్రంలో రాజకీయాల్లో కనమరుగైపోయారు. తాజాగా జరగబోయే ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపుదారులకు అదే గతి పడుతుందని రాజకీయ పండితులు చెబుతున్నారు.

పచ్చకండువా కప్పుకున్నా..

నెల్లూరులో కార్పొరేటర్లు, బుచ్చిరెడ్డిపాళెంలో కౌన్సిలర్లు కొందరు అధికార పార్టీలో ఉంటే నాలుగు రాళ్లు వేనకేసుకోవచ్చని భావించి పచ్చ కండువాలు కప్పుకున్నారు. అయితే అధికార పార్టీలో ఉన్నామనే కానీ.. కనీసం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం లేదని తెలుస్తోంది. ఆయా డివిజన్లు, వార్డుల్లో వీరితో ప్రత్యర్థులుగా పోరాడిన వారిదే పెత్తనం కావడంతో కండువాలు తప్ప.. వీరికి దక్కింది ఏదీ లేదు. తాజాగా ఎన్నికల్లో వాడుకునేందుకు అధికార పార్టీ ఎన్నెన్నో ఆశలు రేకెత్తిస్తోంది. అయితే వీరిని గెలిచిన పార్టీ నుంచి విప్ అస్త్రం భయపెడుతోంది. వైఎస్సార్‌సీపీ ఈ విషయంలో పక్కా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండడంతోపాటు, న్యాయస్థానం ద్వారా వీరిని అనర్హులుగా ప్రకటింపజేయాలని ప్రయత్నం చేస్తోంది. ఇదే జరిగితే.. అటు అధికారానికి, పదవులకు దూరం కాక తప్పదని తెలుస్తోంది.


డిప్యూటీ మేయర్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కరిముల్లా..

వైఎస్సార్‌సీపీ తరఫున డిప్యూటీ మేయర్‌గా 42 డివిజన్ కార్పొరేటర్ షేక్ కరిముల్లాను జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. గతంలో డిప్యూటీ మేయర్‌గా ఖలీల్ అహ్మద్‌కు ఇచ్చారు. మళ్లీ కూడా ముస్లిం మైనార్టీలకు కేటాయించాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవడంతో వారికే కేటాయించారు.

చీఫ్ విప్‌గా ఊటుకూరు

నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ 13 డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జునను నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. దీంతో చీఫ్ విప్ హోదాలో నాగార్జున వైఎస్సార్‌సీపీ సింబల్‌పై గెలిచిన సభ్యులు అందరికీ విప్ పత్రాలను అందజేశారు.

విప్ జారీ అయితే..



india.gov.in

3. Disqualification on ground of defection not to apply in case of split.- Where a member of a House makes a claim that he and any other members of his legislature party constitute the group representing as faction which has arisen as a result of a split in his original political party and such group consists of not less than one-third of the members of such legislature party,-

(a) he shall not be disqualified under sub-paragraph (1) of paragraph 2 on the ground-

(i) that he has voluntarily given up his membership of his original political party; or

(ii) that he has voted or abstained from voting in such House contrary to any direction issued by such party or by any person or authority authorised by it in that behalf without obtaining the prior permission of such party, person or authority and such voting or abstention has not been condoned by such party, person or authority within fifteen days from the date of such voting or abstention; and

(b) from the time of such split, such faction shall be deemed to be the political party to which he belongs for the purposes of sub-paragraph (1) of paragraph 2 and to be his original political party for the purposes of this paragraph.

4. Disqualification on ground of defection not to apply in case of merger.-(1) A member of a House shall not be disqualified under sub-paragraph (1) of paragraph 2 where his original political party merges with another political party and he claims that he and any other members of his original political party-

(a) have become members of such other political party or, as the case may be, of a new political party formed by such merger; or

విప్ జారీ అయితే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఫిరాయింపుల చట్టం చెబుతోంది. 1980లో 52వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పదో షెడ్యూల్లో చేర్చారు. 2003లో పంచాయతీరాజ్ చట్టాన్ని కూడా సవరణ చేశారు. ఈ ప్రకారం పార్టీ విప్‌ను ఉల్లంఘించి వేరే పార్టీకి ఓటు వేసినా.. పార్టీ ఆదేశాలకు భిన్నంగా ఓటింగ్‌కు గైర్హాజరైనా ఫిరాయింపుల చట్టం వర్తిస్తుందని గతంలో సుప్రీంకోర్టు తీర్పు కూడా ఉంది. తాజాగా కేరళ హైకోర్టు కూడా ఇలాంటి తీర్పునే ఇచ్చింది. ఈ క్రమంలో విప్ ఉల్లంఘించిన వారిపై వైఎస్సార్‌సీపీ న్యాయస్థానం ద్వారా అనర్హత వేటు వేసే అవకాశం ఉంది. ఈ మేరకు వారు న్యాయ నిపుణులతో సిద్ధంగా ఉన్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఏర్పాట్లు

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో ఖాళీ ఏర్పడిన డిప్యూటీ మేయర్ పదవికి సోమవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఎస్ఎంసీ అధికారులు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించి మేయర్, కార్పొరేటర్లు, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో పాటు పలువురు అధికారులు హాజరు కానున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎస్ఎంసీ కార్యాలయ ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మీడియా ప్రతినిధులకు జారీ చేసిన పాస్‌లతో హాజరైన వారినే కౌన్సిల్ హాల్లోకి అనుమతించనున్నారు.

అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ

యానాదిరెడ్డి



బిట్రగుంట ప్రమీలమ్మ



షేక్ షాహుల్



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్మన్ల పోటీకి ఇద్దరు అభ్యర్థులను వైఎస్సార్‌సీపీ ప్రకటించింది. 16వ వార్డుకు చెందిన బిట్రగుంట ప్రమీలమ్మ, 12వ వార్డుకు చెందిన యానాదిరెడ్డిలను వైస్ చైర్మన్ల బరిలోకి దింపింది. 5వ వార్డు కౌన్సిలర్ షేక్ షాహుల్‌ను చీఫ్ విప్‌గా పార్టీ అధిష్టానం నియమించింది. వైఎస్సార్‌సీపీకి చెందిన 18 మంది కౌన్సిలర్లకు విప్ జారీ చేశారు.

విధేయతకు, వెన్నుపోటు మధ్య పోటీ

- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా కరిముల్లా
- విప్‌గా కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున
- జిల్లాలో మైనార్టీలకు మొదట పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌దే
- కొందరు కార్పొరేటర్లు పార్టీకి ద్రోహం చేసి టీడీపీలో చేరారు
- ఆత్మప్రబోధం మేరకు ఓటేయాలి
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



డిప్యూటీ మేయర్ అభ్యర్థి కరిముల్లాకు బీ ఫారం అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్‌లో జరగనున్న డిప్యూటీ మేయర్ ఎన్నిక ధర్మానికి- అధర్మానికి, విధేయతకు-వెన్నుపోటుకు మధ్య జరుగుతేందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాకాణి మాట్లాడారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేస్తున్నామని వెల్లడించారు. తమ పార్టీ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లాను పోటీకి దింపుతున్నామన్నారు. విప్‌గా కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జునను నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కొందరు పార్టీకి ద్రోహం చేసి, టీడీపీలో చేరిన వారు ఆత్మ ప్రబోధం మేరకు ఓటు వేయాలన్నారు. జిల్లాలో మైనార్టీలకు మొదట పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. టీడీపీ గతంలో ఒక కార్పొరేటర్‌ను కూడా గెలిపించుకోలేకపోయినా వైఎస్సార్‌సీపీ బీఫారంపై గెలిచిన వారిని నిస్సిగ్గుగా తమ అభ్యర్థి అని ప్రకటించుకుని బీఫారం ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నైతిక విలువలకు, మోసానికి మధ్య పోటీ జరుగుతుండడంతో నెల్లూరు ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ గుర్తు మీద గెలిచిన వారికి విప్ జారీ చేస్తున్నామని, ధిక్కరిస్తే అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. మంత్రి నారాయణకు అవగాహన లేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరాంటూ ప్రకటించడం సిగ్గు చేటన్నారు. ఇప్పటి దాక ఒక్క పథకమైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. మంత్రి నారాయణ ప్రతి కార్పొరేటర్‌ని బెదిరిస్తున్నారని, పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు పోటీ చేస్తామంటున్నారని, పోటీ చేస్తామన్న వారందరిని బుజ్జగించేందుకు ఆయన డబ్బులు పంపిణీ చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీలకు రాజ్యాధికారం వైపు అడుగులేస్తూ అబ్దుల్‌అజీజ్ కి మేయర్‌గా అవకాశం ఇస్తే, ఆయన పార్టీ మారి తన రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టుకున్నారని గుర్తు చేశారు. అజీజ్‌తో వెళ్లిన కార్పొరేటర్లు దాదాపు ఎవరూ కూడా తిరిగి రాజకీయాల్లో కొనసాగలేకపోయారని తెలిపారు. పార్టీ మారితే రాజకీయ జీవితం అంతం అవుతుందని, గత కార్పొరేటర్ల మాదిరిగా చరిత్రహీనులుగా మిగిలిపోవద్దని హితవు పలికారు. అనంతరం డిప్యూటీ మేయర్ అభ్యర్థి కరిముల్లాకు బీ ఫారం అందజేశారు.

పిచ్చోడి చేతిలో పాలన

- మంత్రి నారాయణ విష సంస్కృతిని పోషిస్తున్నారు
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. తప్పు చేసిన అధికారులను వదిలే ప్రసక్తే లేదు
- వైఎస్సార్‌సీపీ నేత భవనాన్ని కూల్చి కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు
- కోర్టులో కమిషనర్ నిలబడక తప్పదు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్‌లో మంత్రి నారాయణ విష సంస్కృతిని పెంచి పోషిస్తున్నారని, పిచ్చోడి చేతిలో పాలనగా సాగుతుందని కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న నెల్లూరు నగర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లతో కలిసి కాకాణి మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ మద్దతుదారులను వేధింపులు గురిచేయడమే కాకుండా వారి ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత బాలకృష్ణారెడ్డి ఇంటికి సంబంధించి 40 సంవత్సరాల డాక్యుమెంట్స్ ఉన్నప్పటికీ కక్ష పూరితంగా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఆ భవనాన్ని నిట్టనిలువునా మంత్రి నారాయణ కూల్చివేయించారని మండిపడ్డారు. ఈ విషయంలో కమిషనర్‌ను ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రేపు కోర్టులో నిలబడాల్సిన పరిస్థితి తప్పదని చెప్పారు. నిరుపేదలు ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లు కూలగొడితే ఆ బాధ ఎలా ఉంటుందో మంత్రి నారాయణకు తెలుసా అని ప్రశ్నించారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, తప్పు చేసిన అధికారులను వదిలే ప్రసక్తే లేదన్నారు. పన్నులు చెల్లించని ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని బోర్డులు ఏర్పాటు చేయడం సిగ్గు చేటన్నారు.

తొమ్మిది నెలలుగా విధ్వంసకర పాలన

ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారితే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు. తమ పార్టీ నేత బాలకృష్ణారెడ్డి ఇంటిని మంత్రి నారాయణ కక్ష పూరితంగా కూల్చివేయించారని, ఆ పార్టీ పట్ల ప్రజల్లో అసహ్యం ఏర్పడిందన్నారు. బాలకృష్ణారెడ్డికి వైఎస్సార్‌సీపీ అండగా నిలబడి న్యాయ పోరాటం చేయడమే కాకుండా, ఈ విషయాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు కమిషనర్ ఎంతో మేలు చేస్తారని అనుకుంటే, మంత్రి నారాయణ పాలేరుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. 51వ డివిజన్‌లో తమ పార్టీ కార్యకర్త శౌరికి సంబంధించిన 5 షాపులను మూసివేయించి 50 కుటుంబాలను రోడ్డున పడేసి మంత్రి నారాయణ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత, వేదికపై పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, ఎంఎ గపూర్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాల్సిందే

- అప్పుల పేరుతో మోసం చేయడం తగదు
- సీపీఎం రాష్ట్ర మహాసభల్లో నిలదీసిన పొలిట్‌బ్యూరో సభ్యులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాల్సిందేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, ఎంఎ గపూర్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్‌లోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల్లో రెండో రోజు ఆదివారం రాష్ట్ర, జిల్లా నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు పలు తీర్మానాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు 8 నెలల పాటు ఓపిక పట్టారని, ఇక ఓపిక పట్టలేరని, సహనం నశిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అమలు కానీ హామీలు ఇచ్చారని, అప్పుడు అప్పులు ఉన్నాయనే విషయం తెలియదా? అని నిలదీశారు. ఆర్థిక సంక్షోభం పేరుతో ప్రజలను మోసం చేయడం, కాలయాపన చేయడం తగదన్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఎందుకు ఇవ్వలేదో ప్రజలుకు వివరించాలన్నారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలపై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలుతోపాటు ఏపీ సమగ్రాభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వమే నడపాలని తదితర 28 అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మోహన్‌రావు, సీఐటీయూ ఆలిండియా అధ్యక్షురాలు హేమలత, కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, మధు, ప్రభాకర్‌రెడ్డి, బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలోని రైతులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగకరంగా కేంద్ర బడ్జెట్ లేదని ఆరోపిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. అనంతరం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ ఆలిండియా అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతాంగానికి వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, సంపన్నులకు మద్దతు ఇచ్చేలా బడ్జెట్ రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్, ఆల్ ఇండియా సీఐటీయూ కోశాధికారి సాయిబా బు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యంపై ఆమె తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 31 తేదీన రాత్రి నుంచి బాలిక కనిపించకపోవడంతో బంధువుల గ్రామాల్లో విచారించారు. ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ కోసం వచ్చి..

- అతిగా మద్యం తాగిన వృద్ధుడు
- కాసేపటికి మృత్యువాత

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్ఆర్‌పల్లికి చెందిన ఎస్‌కే బషీర్ (65) అనే వృద్ధుడు అతిగా మద్యం తాగి పడిపోయాడు. ఎండ తీవ్రతను తట్టుకోలేక మృతిచెందిన ఘటన మున్సిపల్ పరిధిలో జరిగింది. ఎస్సై ఎస్‌కే జిలానీ వివరాల మేరకు ఎస్‌కే బషీర్ గతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా విధులు నిర్వహించేవాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. ఒకరు అమెరికాలో స్థిరపడగా, మరో కుమార్తె హైదరాబాద్‌లో ఉంటోంది. బషీర్ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆత్మకూరులో వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు ప్రతినెలా ఒకటో తేదీన వచ్చి తిరిగి వెళ్తుండేవాడు. బషీర్‌కు మద్యం అలవాటు ఉంది. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చి పింఛన్ తీసుకున్న అనంతరం సమీప బంధువైన ఎస్‌కే హుస్సేన్‌బాషాతో కలిసి మున్సిపల్ పరిధిలోని చంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో అతిగా మద్యం తాగాడు. కొంత సమయం తర్వాత బషీర్‌ను అక్కడే వదిలి హుస్సేన్ మత్తులోనే ఇంటికెళ్లాడు. బషీర్ మాత్రం బార్‌కు సమీపంలో రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడిపోయాడు. అతను ఇంటికి రాకపోవడంతో రాత్రి సమీప బంధువులు హుస్సేన్ ద్వారా విషయం తెలుసుకుని బార్ సమీపంలో పరిశీలించగా చెట్లపొదల్లో విగతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై జిలానీ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తొలుత అనుమానాస్పద మృతిగా భావించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం పూర్తి స్థాయిలో విచారణ చేసి అతిగా మద్యం తాగడం, ఎండ తీవ్రతను తట్టుకోలేక బషీర్ మృతిచెందినట్లుగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మిద్దె పైనుంచి పడి ఏసీ మెకానిక్ మృతి



ఘటనా స్థలంలో సంజీత్ మృతదేహం

ముత్తుకూరు: ఏసీలు అమర్చేందుకు వచ్చి మిద్దె పైనుంచి పడిన ఓ మెకానిక్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. కృష్ణపట్నం పోర్టు ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్లో ఏసీలు అమర్చేందుకు సంజీత్ (22) అనే మెకానిక్ కొందరు వర్కర్స్‌తో కాంట్రాక్ట్ పద్ధతిపై వచ్చాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతను మద్యం మత్తులో 4వ అంతస్తులో పనిచేస్తుండగా కింద పడి చనిపోయాడు. సీఐ రవినాయక్‌తోపాటు ఎస్సై తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి: రూ.30
సన్నవి: రూ.20
పండ్లు: రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	113
లేయర్ (లైవ్):	85
బ్రాయిలర్ చికెన్:	206
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	230
లేయర్ చికెన్:	145





వివిధ జాతుల కుక్కలు




బాగా రెడీ చేశారు కదా..

డాగ్ షో అదుర్స్



షోకు తీసుకొచ్చిన కుక్కలు



షోకు విచ్చేసిన జేసీ కార్తీక్ దంపతులు

నెల్లూరు(సెంట్రల్): కుక్క.. మనుషులకు అత్యంత విశ్వాసమైనది. ఒకప్పుడు వీటిని ఇంటికి కాపలాకు వినియోగించేవారు. నేడు కొందరు స్టేటస్ కోసం వివిధ జాతులను పెంచి పోషిస్తున్నారు. దీని కోసం భారీగానే ఖర్చు చేస్తున్నారు. నెల్లూరు కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో డాగ్ షో జరిగింది. సుమారు 25 జాతులకు చెందిన కుక్కలు ఒకచోట చేరి చేసిన విన్యాసాలు జంతు ప్రేమికులకు ఆకట్టుకున్నాయి.

25 సంవత్సరాలుగా..

నెల్లూరు కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా డాగ్ షో నిర్వహిస్తున్నారు. యాజమానులు తాము ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న శునకాలను తీసుకొస్తుంటారు. ఈ ఏడాది కూడా జర్మన్ షెపర్డ్, డాబర్ మెన్, పామరేనియన్, హస్కీ తదితర జాతులకు చెందిన కుక్కల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కుక్క ఎన్ని నిమిషాల్లో ఎంత దూరం నడుస్తుంది?, యాజమాని మాట అర్థం చేసుకుంటుందా?, నడక, పరుగు, ఇంకా ఆరోగ్యంగా ఉందా? తదితర అంశాల ఆధారంగా బహుమతులు ప్రదానం చేశారు. షో సందర్భంగా వివిధ జాతుల పాములు, పక్షుల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

- షోలో నెల్లూరు వాసి అయిన నరేష్‌కు చెందిన డాబర్ మెన్ మొదటి బహుమతి గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిగిలినవి వివిధ బహుమతులు అందుకున్నాయి.

ఆదరణ లభిస్తోంది



25 సంవత్సరాల నుంచి డాగ్ షో నిర్వహిస్తున్నాం. ప్రతిసారి ఎంతో ఆదరణ లభిస్తోంది. వివిధ అంశాల ఆధారంగా బహుమతులు అందజేస్తున్నాం.
– బొబ్బల శ్రీనివాస్ యాదవ్, నెల్లూరు కెన్నల్ క్లబ్ అధ్యక్షుడు

ఎన్నో జాతులను తెస్తున్నారు



షోకు యజమానులు వివిధ జాతులకు చెందిన కుక్కలను తీసుకొస్తున్నారు. ప్రతి ఏడాది ఈ షో ఉంటుంది.
– సురేంద్ర కుమార్, క్లబ్ సెక్రటరీ

భగవంతుడి అనుగ్రహంతో ఏదైనా సాధ్యం



జనార్దనస్వామి ఆలయంలో పూజలు



అనుగ్రహభాషణ చేస్తున్న చినయర్ స్వామి

- చినజీయర్ స్వామి

దుత్తలూరు: భగవంతుని అనుగ్రహం ఉంటే ఏదైనా సాధించవచ్చని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు. మండలంలోని నర్రవాడ గ్రామంలో జరుగుతున్న జనార్దన స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు మేళతాళాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జనార్దనస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అనుగ్రహభాషణ చేశారు. స్వామి సంకల్పితంతో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయన్నారు. ఆయన అనుకున్నట్టే ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదాల బాబూరావు, గ్రామ పెద్దలు మల్లంపాడు గురవయ్యనాయుడు, మాదాల తిమ్మయ్య చౌదరి, గోగినేని రామచంద్ర, ఆలయ ఈఓ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

- రౌడీషీటర్లను హెచ్చరించిన డీఎస్పీ సింధుప్రియ



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్‌లు తప్పవని నెల్లూరు నగర డీఎస్పీ పి.సింధుప్రియ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ స్టేషన్ పరిధి లోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీట్ ఎప్పుడు తెరిచారు?, ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారు?, ఏం చేస్తున్నారు? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని, పాత వ్యవహారాలకు స్వస్తి పలికి గౌరవంగా పనులు చేసుకుంటూ కుటుంబసభ్యులతో ఆనందంగా జీవించాలని సూచించారు. తీరుమారని వారిపై నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందన్నారు. ఇళ్లు విడిచి ఊర్లకు వెళ్లేవారు విధిగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రతి వారం క్రమం తప్పకుండా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. మీరు ఉంటున్న ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా? అనుమానాస్పద వ్యక్తుల కదలికలున్నా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రెయినీ డీఎస్పీ శివప్రియ, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దొంగలు

- సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు
- హేచరీల నిర్మాణాలకు తరలింపు
- టీడీపీ నాయకుల నిర్వాకం



ఇసుక తవ్వకాలు జరిగిన తీరం

ఉలవపాడు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు. నదులు, ఏరులు, అటవీ భూముల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం తెలిసిందే. చివరకు సముద్రం వద్ద ఇసుకను కూడా అక్రమంగా తరలిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అవినీతికి కాదేది అనర్హం అన్న చందంగా కూటమి నేతలు తయారయ్యాయి. మండల పరిధిలోని కరేడు పంచాయతీ టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. కరేడు, టెంకాయచెట్లపాళెం, అలగాయపాళెం ప్రాంతాల్లో సముద్ర తీరంలో ఉన్న ఇసుకను టీడీపీ నేతలు హేచరీల నిర్మాణ పనుల్లో భాగంగా వందల ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మళ్లీ తీరంలో ఇసుక మేట వేస్తుందిలే.. అడిగేవారు లేరనే ధైర్యంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలో గతంలో హేచరీల నిర్మాణానికి అటవీ భూముల్లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలించేవారు. కానీ ఇప్పుడు సముద్ర తీరాన్ని కూడా వదల్లేదు.

పట్టించుకోని అధికారులు

మండల పరిధిలో రెవెన్యూ శాఖ మొద్దు నిద్రలో ఉంది. టీడీపీ నాయకులు ఏం చేసినా చూడటం తప్ప చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. తీరం రెవెన్యూ శాఖ పరిధిలోనే ఉంటుంది. ఈ భూములను గతంలో తుఫాన్లు వచ్చినప్పుడు వాటికి అడ్డుగా ఉండటానికి కొల్లూరుపాడు బీట్ అటవీ శాఖకు సరుగుడు చెట్ల పెంపకానికి అప్పగించారు. కేవలం మొక్కల పెంపకం తప్ప భూమిపై అటవీ శాఖకు హక్కు లేదు. కానీ గతంలో మొక్కలు పెంచారు కాబట్టి రెవెన్యూ, అటవీ శాఖకు సంబంధించిన అధికారులు ఈ ఇసుక తరలింపును అడ్డుకోవాలి. కానీ రెవెన్యూ శాఖ కనీసం పట్టించుకోలేదు. ఇటీవల అటవీ శాఖకు చెందిన అధికారి వెళ్లినప్పుడు తెలుగు తమ్ముళ్లు దాడి చేయబోయినట్లు సమాచారం. ఈ విషయం బయట పడటకుండా జాగ్రత్త పడినట్లు స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు తీరంలో ఇసుక తరలింపు ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

వీఎస్‌యూలో కొత్త కోర్సు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ), ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) సంయుక్తంగా వర్సిటీలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ – డొమెస్టిక్ నాన్ వాయిస్ శిక్షణ కోర్సును త్వరలో ప్రారంభించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.విజేత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. అభ్యర్థులు 10వ తరగతి చదివి ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశం కల్పిస్తామని తెలియజేశారు. ఆసక్తి గల వారు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 95734 82179 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్ టీఏ జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్‌రెడ్డి



కాకాణిని సత్కరించిన వైఎస్సార్ టీఏ నేతలు

నెల్లూరు(బారకాసు): ఏపీ వైఎస్సార్ టీఏ జిల్లా అధ్యక్షుడిగా కొత్తూరు శివశంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నెల్లూరు రాంజీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ కార్యాలయంలో ఆ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సమావేశ అనంతరం అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం సుధీర్‌ను సంప్రదించి అందరి అభిప్రాయాలతో ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా కొత్తూరు శివశంకర్‌రెడ్డిని, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నీరుకట్ల శ్రీలతను ఎన్నుకున్నారు. వారిని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎమ్మెల్సీ పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏపీ వైఎస్సార్ టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసు, కార్యదర్శులు సుబ్బారెడ్డి, సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్, జాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మెరిసిన క్రీడా ఆణిముత్యం

- పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి
- రోప్‌జంప్‌లో రాణిస్తున్న శ్రావణి
- చదువుల్లోనూ ప్రతిభ
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం



జిల్లా నుంచి మరో క్రీడా ఆణిముత్యం అంతర్జాతీయ స్థాయిలో మెరిసింది. సామాన్య మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన శ్రావణి జంప్‌రోప్‌లో రాణించింది. పతకాలు సాధిస్తూ చదువుతున్న పాఠశాలకు, పుట్టిన ఊరికి విశేష గుర్తింపు తీసుకొచ్చింది. మరోవైపు చదువుల్లోనూ రాణిస్తున్న ఆ విద్యార్థినిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు.





తల్లిదండ్రులతో శ్రావణి

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరికి చెందిన వనిపెంట చంద్రమోహన్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె శ్రావణి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కలిగిరిలో చిన్నపాటి కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. రెండో కుమార్తె శ్రావణి చదువుల్లో మెరుగైన ఫలితాలు సాధించడంతోపాటు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడంతో ఆ కుటుంబం ప్రోత్సాహం ఎంతగానో ఉంది.

అంతర్జాతీయ స్థాయిలో..

జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు నేపాల్‌లో నిర్వహించిన ఇండో – నేపాల్ జంప్‌రోప్ చాంపియన్‌షిప్ – 2025లో రెండు శ్రావణి పాల్గొని బంగారు పతకాలు సాధించి సత్తా చాటింది. మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడానికి ముమ్మర కసరత్తు చేస్తోంది. చంద్రమోహన్‌రెడ్డి, విజయలక్ష్మిలు ఖర్చుకు వెనకాడకుండా కుమార్తె ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.

ఫిజికల్ డైరెక్టర్ చొరవతో..

శ్రావణి 8వ తరగతి చదువుతున్న సమయంలో క్రీడల పట్ల ఆమెకున్న ఆసక్తిని అప్పటి పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, ప్రస్తుత జంప్‌రోప్ నెల్లూరు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జి.మురళి గుర్తించారు. బాలికను ప్రోత్సహించి అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగడానికి కారణమయ్యారు. శ్రావణి జంప్‌రోప్‌తోపాటు షూటింగ్ బాల్, టార్గెట్ బాల్, జూడోలో ప్రావీణ్యం సాధించింది. బాలిక ఏ టోర్నమెంట్ పాల్గొన్నా ప్రతిభ చూపి పతకాలు సాధిస్తోంది. ఇప్పటివరకు జంప్‌రోప్‌లో జిల్లా స్థాయిలో 10, జాతీయస్థాయిలో ఐదు గోల్డ్, ఒక సిల్వర్, ఇంటర్నేషనల్ స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించింది. 2023లో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది.

వారి ప్రోత్సాహంతోనే..

అమ్మానాన్న అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుండటంతో బాగా చదవడంతోపాటు క్రీడల్లో రాణిస్తున్నా. ఉపాధ్యాయులు, జంప్‌రోప్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.మురళి శిక్షణ, సహకారంతోనే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించగలిగా. ఐపీఎస్‌గా అవ్వడమే నా లక్ష్యం.
– శ్రావణి

ప్రతిభకు మెరుగులు



విద్యార్థుల్లో ఉన్న ప్రతిభకు మెరుగులు దిద్దితే అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటారనడానికి శ్రావణి నిదర్శనం. నా వద్ద శిక్షణ పొందిన విద్యార్థిని క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉంది. క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తాను.
– జి.మురళి, జంప్‌రోప్ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ